క్లుప్తంగా

భట్టిప్రోలు పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా రమేష్

భట్టిప్రోలు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) చైర్‌పర్సన్‌గా ఓలేరు గ్రామానికి చెందిన పరుచూరి రమేష్, డైరెక్టర్లుగా భట్టిప్రోలు, వెల్లటూరుకు చెందిన కొలుసు వెంకట శేషగిరిరావు, గుత్తిపాటి కృష్ణారావులను ప్రభుత్వం నియమించింది. పీఏసీఎస్ సీఈవో వేములపల్లి శ్రీనివాసరావు నియమితులైన వారిచే ప్రమాణ స్వీకారం చేయించారు. పీఏసీఎస్ అభివృద్ధికి చర్యలు తీసుకోనున్నట్లు చైర్‌పర్సన్ రమేష్ పేర్కొన్నారు.

ఈపూరు పీఏసీఎస్ చైర్మన్ బాధ్యతల స్వీకరణ

కొల్లూరు : సొసైటీ బ్యాంక్ ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించడంపై నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చైర్మన్, డైరెక్టర్లు దృష్టి కేంద్రీకరించాలని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని ఈపూరులో ఇటీవల నూతన చైర్మన్, డైరెక్టర్లను నియమిస్తూ వెలువడిన ఉత్తర్వులలో భాగంగా ఈపూరు సొసైటీ బ్యాంక్‌కు పీఏసీఎస్ చైర్మన్‌గా మేక దివాకర్, డైరెక్టర్లుగా దూళిపాళ్ల రామాంజనేయులు, వాసుమళ్ల రత్నబాబులతో ఎమ్మెల్యే పదవీ ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా ఆయన సొసైటీ బ్యాంక్ సేవలను విస్తృతం చేయాలని సూచించారు. అనంతరం టీడీపీ చేపట్టిన సుపరిపాలనలో ముందడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు కనగాల మధుసూదన్ ప్రసాద్, మైనేని మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని యువకుడు అనుమానాస్పద మృతి



రేపల్లె: అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని యువకుడు మృతి చెందిన ఘటన పెటేరులో చోటు చేసుకుంది. పట్టణ సీఐ మల్లికార్జునరావు కథనం ప్రకారం పెటేరులోని చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రం సమీపంలో సుమారు 30 సంవత్సరాల వయస్సు గల యువకుడు గొంతు కోసి మృతి చెంది ఉన్నాడన్నారు. మృతుని వివరాలు తెలియరాలేదని చెప్పారు. వీఆర్వో నీలా మహేష్‌బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించామన్నారు. వివరాలు తెలిసినవారు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

కెప్టెన్ విజయప్రసాద్ సాహసం తెనాలికే గర్వకారణం



తెనాలి: శ్రీలంకలో ఎల్‌టీటీఈతో జరిగిన ఎదురుకాల్పుల్లో అమరుడైన పట్టణానికి చెందిన పారా కమెండో కెప్టెన్ యర్రమనేని విజయప్రసాద్ 37వ వర్ధంతిని శుక్రవారం స్థానిక చెంచుపేటలోని శబరి వృద్ధాలయంలో నిర్వహించారు. కెప్టెన్ విజయప్రసాద్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కెప్టెన్ విజయప్రసాద్ త్యాగం తెనాలికి గర్వకారణమని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీత వేజళ్ల ఉమామహేశ్వర్ అన్నారు. ఆ అమర వీరుడి స్మారకార్థం తల్లిదండ్రులు మీనాకుమారి, వైఎల్ నారాయణ ఏటా పాఠశాల విద్యార్థుల ఉన్నత చదువులకు ఆర్థికసాయం చేస్తూ, వృద్ధులకు చేయూతను అందిస్తున్నారని గుర్తు చేశారు. వృద్ధాప్యంలోనూ సమాజసేవ చేస్తుండటాన్ని అభినందించారు. కార్యక్రమంలో వై.ఎల్.నారాయణ, ఆనందరావు, మురహరిరావు,భుజంగరావు, సత్యం పాల్గొన్నారు. అనంతరం శబరి ఆశ్రమంలోని వృద్ధులకు ఆహారం అందించారు.

పూర్తయిన రౌడీషీటర్ అంత్యక్రియలు

తెనాలిరూరల్: ఐతానగర్ చెరువులో అనుమానాస్పదంగా మృతి చెంది ఉన్న రౌడీషీటర్ మాతంగి భరత్ అంత్యక్రియలు పూర్తయ్యాయి. భరత్ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమివ్వగా టూ టౌన్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించగా రాత్రికి ఐతానగర్ శ్మశాన వాటికలో అంత్యక్రియలు పూర్తయ్యాయి. వైద్యశాల నుండి మృతదేహాన్ని ఊరేగింపుగా తీసుకురావడంతో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండ పోలీసులు ఐతానగర్‌లో బందోబస్తు ఏర్పాటు చేశారు. గుంటూరు నుంచి వచ్చిన సీఐలు అశోహరి శ్రీనివాస్, నరసింహారావులు పెత్త ఎత్తున సిబ్బంది బందోబస్తును ఇక్కడి పోలీసులతో కలసి పర్యవేక్షించారు.

పెదనందిపాడు ఇన్‌చార్జి ఎంఈఓగా కెన్నడీ

కాకుమాను: పెదనందిపాడు మండల ఇన్‌చార్జి మండల విద్యాశాఖాధికారిగా కె.ఎఫ్.కెన్నడీ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ప్రస్తుతం కాకుమాను మండల ఎంఈఓగా పని చేస్తున్నారు. గతంలో ఇక్కడ ఎంఈఓగా పనిచేసిన శ్రీనివాసరావు పెదనందిపాడు మండలంలోని పాలపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా బదిలీ అయ్యారు.



నారు విత్తనాలు చల్లుతున్న రైతులు



నగరంలో మురుగుకాల్వలోని నీటితో సాగు చేసిన వరి నారుమడి

ప్రతికూల పరిస్థితుల్లో సాగు

- ఖరీఫ్ వరి నారు మడులకు సన్నద్ధమవుతున్న రైతులు
- ముఖం చాటేసిన వరుణుడు
- బోర్లు, మురుగుకాల్వల నీరే ఆధారం

నగరం: ఖరీఫ్ సాగుకు సమయం ఆసన్నమవ్వటంతో ప్రతికూల వాతావరణ పరిస్థితుల నడుమ రైతులు సాగుకు సన్నద్ధమవుతున్నారు. పంట కాల్వలకు సాగునీరు లేకపోయిన, అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకునే ప్రయత్నంలో సాగుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మురుగుకాల్వలు, బోర్లు అందుబాటులో ఉన్న రైతులు నారుమడులు పోసే ప్రక్రియలో నిమగ్నమ వుతున్నారు. మండలంలో ప్రతి ఏడాది 28 వేల ఎకరాలలో ఖరీఫ్ సాగుగా వరి పంటను వేస్తుంటారు. పది శాతం పంట పొలాల్లో బోర్లు, మురుగుకాల్వల నీటిపై ఆధారపడి వ్యవసాయం చేస్తుంటారు. మురుగు కాల్వల పక్కన ఉన్న పొలాలను దుక్కులు దున్నించి నీటిని పెట్టి నారు విత్తనాలను చల్లుతున్నారు. మండలంలోని సజ్జావారిపాలెం, నగరం, కమ్మవారిపాలెం, పూడివాడ తదితర గ్రామాలలో వరి నారు మడులను సిద్ధం చేస్తున్నారు.

వర్షాల కోసం ఎదురుచూపులు

మే నెలలో వర్షాలు పడటంతో రైతులు ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకు అనుకూలంగా ఉంటాయని భావించారు. కాని ఇందుకు విరుద్ధంగా జూన్ నెలలో వర్షాలు పడలేదు. జూలై లోనైనా వర్షాలు పడతాయని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఖరీఫ్ సాగు ఆలస్యమైతే రెండో పంట పండించుకోవటానికి వీలు ఉండదని భావనతో కొంత మంది రైతులు వ్యయ ప్రయాసలను కూడా లెక్కచెయ్యకుండా వ్యవసాయ పనులలో నిమగ్నమవుతున్నారు.

ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించాలని వినతి



వేమూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనులు చేస్తున్న కూలీలకు వేతనాలు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బొనిగల అగస్టిన్ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలోని సూపరింటెండెంట్ అనురాధకు వినతి పత్రం శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కార్మికులు పని చేసి 8 వారాలు గడిచినా ఇప్పటి వరకు వేతనాలు విడుదల చేయలేదని ఆయన ఆరోపించారు. కూలీలకు వ్యవసాయ పనులు లేక నానా అవస్థలు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఉపాధి చట్టం ప్రకారం పని చేసిన రెండు వారాలు లోపు డబ్బులు విడుదల చేయాలని, పనులు చేసి 8 వారాలు అయినా ఇంత వరకు నిధులు మంజూరు చేయలేదన్నారు. కార్యక్రమంలో ఎం.ప్రభుదాస్, టి.చిన్న అంకమ్మరావు, బి.దుర్గారావు, ఆర్ ఏడుకొండలు, టి.వెంకట స్వామి తదితురులు పాల్గొన్నారు.

108 వాహనంలో గర్భిణి ప్రసవం

భట్టిప్రోలు : నిండు గర్భిణికి పురిటి నొప్పులు అధికమై వైద్యశాలకు తరలిస్తుండగా మార్గంమధ్యలోనే ప్రసవించిన సంఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. 108 సిబ్బంది తెలిపిన సమాచారం మేరకు.. మండలంలోని ఐలవరంకు చెందిన రజితకు పురిటి నొప్పులు అధికమవడంతో 108 వాహనంకు సమాచారం అందించారు. అప్పటికే నొప్పులతో బాధపడుతున్న గర్భిణీని సిబ్బంది 108లో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించేందుకు సమాయత్తమయ్యారు. ప్రయాణ సమయంలోనే రజితకు పురిటి నొప్పులు అధికమయ్యాయి. తెనాలి మండలం వైకుంఠపురం వద్దకు చేరుకునే సరికి ప్రసవ వేదనతో గర్భిణి బాధపడుతుండటంతో పరిస్థితిని గమనించిన ఈఎంటీ చంద్రగిరీష్‌బాబు, సిబ్బంది ఎస్.విజయ్ తోటి సిబ్బందితో కలసి సమయస్ఫూర్తితో వ్యవహరించి 108 వాహనంలోనే గర్భిణికి సుఖ ప్రసవం చేశారు. ఆమె మగ బిడ్డకు జన్మనివ్వడంతో తదుపరి వైద్య సేవల నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తల్లీ బిడ్డ క్షేమంగా ఉండటంతో 108 సిబ్బందికి గర్భిణి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.



వాహనంలో ప్రసవించిన బిడ్డను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న 108 సిబ్బంది

మేలైన పశుగ్రాసంతో అధిక పాల దిగుబడి

భట్టిప్రోలు: పాడి పశువుల్లో పాల ఉత్పత్తి సామర్థ్యం పెరగాలంటే మేలైన, నాణ్యమైన పశుగ్రాసాన్ని పచ్చిమేతగా అందించాలని పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వై.పద్మావతి తెలిపారు. శుక్రవారం భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామంలోని పశు వైద్యశాల ఉప కేంద్రంను ఆమె సందర్శించారు. అనంతరం పశుగ్రాస వారోత్సవాలలో పాల్గొన్నారు. పాడి రైతులతో పద్మావతి మాట్లాడుతూ దాణా కన్నా పచ్చని పశుగ్రాసం మేతగా అందిస్తే అధిక పాల దిగుబడి సాధించడంతో పాటు రోగ నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. పశుగ్రాసాల ఎంపిక, పాల ఉత్పత్తి, పశువుల పోషణ అంశాలపై 7వ తేదీ నుంచి 14వ తేదీ వరకు పాడి రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. సౌకర్యం ఉన్నప్పుడు ధాన్యపు జాతి పంటలైన సాగులను వేసుకోవాలని పేర్కొన్నారు. నాణ్యత గల అధిక పచ్చి మేత అధిక దిగుబడి పొందాలంటే పశుగ్రాస పంటను 50 శాతం పూత దశలో కోయాలన్నారు. ఆమె వెంట ఆళ్లమూడి వెటర్నరీ డాక్టర్ మహేష్, పశు వైద్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



పశుగ్రాస వారోత్సవాలలో పాల్గొన్న పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి

జనాభా సమస్యపై విద్యార్థుల చర్చావేదిక

తెనాలి: ప్రపంచ జనాభా దినోత్సవం రోజైన శుక్రవారం స్థానిక ఏఎస్ఎన్ ఫార్మసీ కాలేజీలో ఐపీఏఎస్ఎఫ్-ఏఎస్ఎన్ చాప్టర్ ఆధ్వర్యంలో విద్యార్థులతో చర్చా కార్యక్రమం నిర్వహించారు. 'జనాభా పెరుగుదల-అభివృద్ధికి అడ్డంకా? లేదా అవకాశమా? అనే అంశంపై విద్యార్థులు రెండు పక్షాలుగా చర్చ చేశారు. విద్యార్థులు తమ అభిప్రాయాలను వివరించగా, అధ్యాపకులు, సంస్థ ప్రతినిధులు ప్రశంసించారు. కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ మాట్లాడుతూ జనాభా సమస్యపై యువతకు అవగాహన కల్పించటానికే చర్చా కార్యక్రమం నిర్వహించినట్టు చెప్పారు. ఇటువంటి చర్చలతో విద్యార్థులు సమాజ సమస్యలను లోతుగా అర్థం చేసుకుంటారని చెప్పారు. ఐపీఏఎస్ఎఫ్-ఏఎస్ఎన్ చాప్టర్ మెంటార్ పి.భార్గవి అధ్యక్షత వహించారు. విజేతలకు డాక్టర్ టి.జ్యోతిబసు, కె.కళ్యాణ్ చక్రవర్తి ప్రశంసాపత్రాలను, జ్ఞాపికలను అందజేశారు.



చర్చావేదికలో విద్యార్థులు

ఉన్నత లక్ష్య సాధనకు కృషి చేయండి

తెనాలిఅర్బన్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని వాటిని సాధించే దిశగా కృషి చేయాలని న్యాయవాది పొన్నం విజయ్‌కుమార్ పేర్కొన్నారు. పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో కొత్తపేటలోని రావి సాంబయ్య మున్సిపల్ బాలురోన్నత పాఠశాలలో పదోవ తరగతి ఫలితాల్లో మొదటి మూడుస్థానాలు సాధించిన విద్యార్థులను బట్ట అంజయ్యబాబు, అనురాధల సౌజన్యంతో శుక్రవారం సన్మానించి మెమోంటోలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు భారతి మాట్లాడుతూ విద్యపట్ల ఆసక్తిని పెంపొందించుకుని మంచి ఫలితాలు సాధించే విధంగా కృషి చేయాలన్నారు. పూర్వ విద్యార్థుల సంఘం వ్యవస్థాపకుడు తన్నీరు శివశంకర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి బాగా చదువుకుని స్కూల్‌కు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాసరనేని శ్రీనివాసరావు, కుంభకోణం శ్రీనివాసరాం, పొట్టి నరేంద్ర, ఈఎల్‌వి అప్పారావు, పిడుగురాళ్ళ వీరభద్రరావు, శెట్టిపల్లి సుబ్రమణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించిన విజయ్‌కుమార్, శివశంకర్

ఆలయాల్లో కానుకల లెక్కింపు

తెనాలి: పట్టణంలోని గ్రూప్-2 దేవాలయాల పరిధిలోని స్థానిక రామలింగేశ్వరపేటలోని రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం స్వామివారి హుండీ లెక్కింపు నిర్వహించారు.ఆలయ కార్యనిర్వహణ అధికారి హరిప్రసాద్ ఆధ్వర్యంలో హుండీని లెక్కించగా ఆదాయం రూ.1,32,769 వచ్చిందని చెప్పారు. స్థానిక గాంధీచౌక్‌లోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో రూ.18,637 వచ్చినట్లు తెలిపారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎస్.శారదాదేవి పర్యవేక్షణలో కానుకలను లెక్కించారు.

14 లోపు ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగించాలి

తెనాలిఅర్బన్: కొత్తపేటలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం రోడ్డులో అనధికారికంగా ఏర్పాటు చేసిన బడ్డీ కొట్టులు, పందిళ్లను సోమవారం లోపు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. వీటిని ఏర్పాటు చేయడం వలన తహసీల్దార్ కార్యాలయం, 1టౌన్ పోలీసు స్టేషన్, కోర్టు సముదాయానికి వచ్చేవారికి అనేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయని చెప్పారు. అలాగే మురుగు కాల్వలను శుభ్రం చేయడానికి ఇవి అవరోధంగా మారాయన్నారు. అక్రమణదారులు మున్సిపాలిటీకి సహకరించాలని సూచించారు. లేని పక్షంలో అక్రమణలు తొలగించడంతో పాటు దానికైన ఖర్చును కూడా వసూలు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

తెనాలిఅర్బన్: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎంప్లాయిస్ యూనియన్ ఎంతో కృషి చేస్తుందని సంఘ జిల్లా కార్యదర్శి ఈపూరి విజయ్ కుమార్ పేర్కొన్నారు. ఏపీ పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ 74వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆర్టీసీ డిపో ఆవరణ వద్ద శుక్రవారం నిర్వహించారు. మహిళా నాయకులు లక్ష్మీపార్వతి, భూలక్ష్మి కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బి.సాంబశివరావు, పి.యలమందయ్య, డిపో అధ్యక్ష కార్యదర్శులు కె.బాబు, ఎస్.సుధాకరరావు, బి.శ్రీనివాసరావు, దీపాల శివ శ్రీనివాసరావు, వి.జోషిబాబు, ఐమళ్ళ రాజేషఖన్నా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పౌర్ణమి సామూహిక హారతులు



తెనాలిరూరల్: ఆషాఢ శుద్ధ పౌర్ణమి, వ్యాస పౌర్ణమిని పురస్కరించుకుని సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంగలకుదురు గేటు వద్ద ఉన్న శ్రీ కోదండ రామాలయాలలో గురువారం రాత్రి పౌర్ణమి సామూహిక హారతులు సమర్పించి భజన సంకీర్తనలు చేశారు. తెనాలి సబ్ డివిజన్ కన్వీనర్ కడియాల సునీల్ కుమార్ మాట్లాడుతూ దీపం పరబ్రహ్మ స్వరూపం అని, సామూహిక హారతులు వల్ల సైన్స్ పరంగా కూడా చెడు క్రిములు చనిపోయి వాతావరణ సమతుల్యం ఏర్పడుతుందని చెప్పారు. ఆరోగ్యపరంగా నాసికా రంధ్ర, కంటి వ్యాధులు తొలుగుతాయని, దృష్టి దోషాలు తొలగడంతో పాటు స్వామి వారి అనుగ్రహం కలిగి శుభం కలుగుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో మహిళా కన్వీనర్లు బద్దుల పద్మ, వరలక్ష్మి, అనిత పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రేపల్లె: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 8 నుంచి 2 గంటల వరకు పట్టణంలోని పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయబడునని ఆ శాఖ డిప్యూటీ ఈఈ డి.శ్యామ్‌సుధాకర్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని బస్టాండ్ నుంచి ఇసుకపల్లి వరకు ఎడమవైపు ప్రాంతం, గరువురోడ్డు, ఉప్పూడి రోడ్డు, ఉప్పూడి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయబడునన్నారు. మండలంలోని కారుమూరు, బొబ్బర్లంక ఫీడర్‌ల పరిధిలోని కారుమూరు, వేజళ్ళవారిలంక, బొబ్బర్లంక, బోడాయపాలెం, కైతేపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కొల్లూరు : విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా శనివారం మండలంలోని కొల్లూరు సబ్‌స్టేషన్ పరిధిలోని గాజుల్లంక ఫీడర్, ఈపూరులంక సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం వాటిల్లనున్నట్లు ఏఈ కె.సుధాకర్‌బాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఆవులవారిపాలెం, పెసర్లంక, గాజుల్లంక, ఈపూరులంక, చింతర్లంక, పెదలంక గ్రామాలలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ప్రకటించారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

వేమూరు: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీరు గోపి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు మండలంలోని అన్ని గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

నగరం: మండలంలోని ఉల్లిపాలెం సబ్‌స్టేషన్ పరిధిలోని ధూళిపూడి ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ ఎండీ నాగుల్‌మీరా శుక్రవారం తెలిపారు. మండలంలోని చిరకాలవారిపాలెం, కొలగానివారిపాలెం, ఏలేటిపాలెం, బెల్లంవారిపాలెం, ధూళిపూడి, అద్దంకివారిపాలెం గ్రామాలలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆయన విలేకరులకు తెలిపారు.

అమర్తలూరు(వేమూరు): తెనాలి సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మండలంలోని అమర్తలూరు 33/11 కేవీ సబ్ సేష్టన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ నిలిపి వేయడం జరుగుతుందని ఇన్‌చార్జి ఏఈ దోనేపూడి అర్జునరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

చుండూరు(వేమూరు): మండలంలోని మోదుకూరు ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ దోనేపూడి అర్జునరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మోదుకూరు ఫీడర్ పరిధిలో చినపరిమి, చినగాదెలవర్రు, పెదగాదెవలర్రు, ఆరమండపేట గ్రామాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతులు కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

సత్ప్రవర్తన, క్రమశిక్షణతో నడుచుకోవాలి

మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు

రేపల్లె: విద్యార్థి దశ నుంచే సత్ప్రవర్తన, క్రమశిక్షణతో నడుచుకోవాలని అప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహించటం సులభతరమవుతుందని మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు అన్నారు. పట్టణంలోని మోంట్‌ఫోర్ట్ స్కూలులో శుక్రవారం నిర్వహించిన స్కూల్ కేబినెట్ ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు కేవలం విద్యకే పరిమితం కాకుండా ఆట పాటలు, సాంస్కృతిక, సేవా రంగాలలోనూ తమ సత్తా చాటాలన్నారు. క్రీడారంగంలో రాణించిన వారికి మంచి భవిష్యత్ ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా విద్య, క్రీడా, సాంస్కృతిక, సేవా రంగాలలో నూతనంగా ఎన్నికైన స్కూల్ నూతన కేబినెట్ విద్యార్థులచే ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన మార్చిఫాస్ట్, క్రీడా విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బ్రదర్ కిరణ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ప్రదీప్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



సచివాలయ ఉద్యోగులకు సత్కారం

రేపల్లె: పట్టణంలోని 9, 11 వార్డు సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న పలువురు సెక్రటరీలు సాధారణ బదిలీపై ఇతర సచివాలయాలకు వెళుతున్న సందర్భంగా పట్టణ ఆర్యవైశ్య నాయకులు సుగ్గుల సుదర్శనరావు ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక సచివాలయంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సెక్రటరీలు సీహెచ్ రాఘవరావు, బి.ఝాన్సీహరిత, తలకోల హిమని, ఉయ్యూరు రాధిక, ఎస్.వాసవీ కుమారి, మెరుగ దుర్గా భవానీలను ఘనంగా సత్కరించారు. సచివాలయాల ద్వారా సెక్రటరీలు అందించిన సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు మేకా రామకృష్ణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, కొండవీటి అగస్త్య శాస్త్రి, ఆర్యవైశ్య నాయకులు తడికమళ్ళ బాలు, వంకాయల రామకృష్ణ, మానేపల్లి మల్లికార్జునరావు, కాశేపల్లి తిలక్, పొన్నూరు శ్రీనివాసరావు, కాశేపల్లి సాయి తదితరులు పాల్గొన్నారు.



పొదల మాటున ప్రమాదం

భట్టిప్రోలు: భట్టిప్రోలులో ఇళ్లకు విద్యుత్ సరఫరా చేసే స్తంభాలపై ముళ్ల, పిచ్చి పొదలు, కలుపు జాతి మొక్కలు అల్లుకున్నాయి. దీని వల్ల తరచూ విద్యుత్ అంతరాయం తలెత్తుతోందని అయినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. విద్యుత్ శాఖాధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. మార్గంలో నడచి వెళ్లేవారు పొరపాటున మొక్కలను తాకితే ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. కాగా 10వ వార్డులోని విద్యుత్ స్తంభంపై పొదలు ఉన్న వీధి లైటు పగలు, రాత్రి వెలుగుతూనే ఉంటుంది. అలాగే గ్రామంలో కొన్ని చోట్ల విద్యుత్ స్తంభాలు తక్కువ ఎత్తులో ఉండటం వల్ల తీగలు తగులుతున్నాయి. చెట్లు పొదలు పెరిగి తరచుగా సరఫరాకు అంతరాయం కలుగుతుంది. దీంతో ఈ ప్రాంతంలో వినియోగదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. దీనిపై స్పందించిన విద్యుత్ శాఖ ఇన్‌చార్జి ఏఈ శాంతకుమారి పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు.



భట్టిప్రోలు 10వ వార్డులో స్తంభంపై అల్లుకున్న ముళ్ల, పిచ్చి పొదలు

పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

కాకుమాను: పెదనందిపాడు మండలంలో పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ కుమార్ అన్నారు. పెదనందిపాడులో శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కాకుమాను మండలంలో ఏర్పాటు చేసిన పొగాకు కొనుగోలు కేంద్రంలో కేవలం 5 గ్రామాలలోని రైతుల నుంచి మాత్రమే పొగాకు కొనుగోలు చేస్తున్నారని ఆయన తెలిపారు. పెదనందిపాడు మండలంలో 16 గ్రామాలలోని రైతులు పొగాకు సాగు చేశారని.. అయినప్పటికీ మండలంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని.. కానీ నేటికీ దానిని ఏర్పాటు చేయకపోవడం అన్యాయమని అన్నారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివరావు, నల్లమోతు రాజేంద్ర, పసుపులేటి శేషగిరిరావు, మదమంచి అప్పారావు, రైతులు పాల్గొన్నారు.



సమాజానికి మరిన్ని సేవలు విస్తృతం చేస్తాం



తెనాలిటౌన్: రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం సభ్యుల సహకారంతో సమాజానికి మరిన్ని సేవలు అందిస్తామని క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పినపాడులోని మున్సిపల్ ఉర్దూ పాఠశాలలోని విద్యార్థులకు నోటుబుక్స్, తినుబండరాలను పంపిణీ చేశారు. అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్ పాల్గొని విద్యార్థులకు వీటిన్ని అందజేశారు. క్లబ్ కార్యదర్శి జి.వి.నారాయణ సహకారంతో విద్య సామగ్రి అందించినట్లు చెప్పారు. రాబోయే రోజుల్లో సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావు, గుత్తా వెంకటరత్నం, ఈదర శ్రీనివాసరావు, మల్లాది అర్జున, కొల్లి రాజేంద్రప్రసాద్, ఆలపాటి వెంకట్రామయ్య, తదితరులు ఉన్నారు.